
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 4 అక్టోబరు 2024



హరిదాసులేరి?

- భద్రాద్రిలో కీర్తనలు ఆలపించడానికి హరిదాసు వ్యవస్థ ఏర్పాటు
- నరసింహదాసు ఉత్సవాల పరిరక్షణకు చర్యలేవి?
- జ్ఞాపకాల సంరక్షణ శూన్యం

6



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే గురువారం ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైంది. ఇరుజిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాలు, మునిసిపల్ వార్డుల్లో సర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఈ సర్వే పట్ల గ్రామాల్లో ఆసక్తి నెలకొంది. భవిష్యత్తులో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, రేషన్‌కార్డులకు ఈ సర్వే కార్డే ఆధారమన్న ప్రచారంతో సర్వే జరుగుతున్న గ్రామాలకు సంబంధించిన వారు ఇతర ప్రాంతాల్లో ఉంటే ఆయా కుటుంబ సభ్యులు వారిని పిలిపించి మరీ వివరాలు నమోదు చేయిస్తున్నారు. సర్వే కొన్నిచోట్ల ఉదయం ప్రారంభం కాగా మరికొన్ని చోట్ల మధ్యాహ్నం ప్రారంభమైంది. సర్వేలో కుటుంబంలోని మహిళ పేరు, భర్త, పిల్లల వివరాలు, ఆధార్‌కార్డు నెంబర్లు, ప్రస్తుత వయస్సు తదితర వివరాలు సేకరిస్తున్నారు.



కొత్తగూడెంలో అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

డిజిటల్ సర్వే ఘుయూ

ఉమ్మడి జిల్లాలో ఫ్యామిలీ కార్డ్ పైలెట్ సర్వే ప్రారంభం

- పలు గ్రామాలు, మునిసిపల్ వారుల్లో వివరాల సేకరణ
- కొత్త సర్వేలో పెరుగుతున్న కుటుంబాల సంఖ్య
- సర్వేను సమన్వయం చేస్తున్న ఇరు జిల్లాల కలెక్టర్లు
- ప్రక్రియను పరిశీలించిన జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) /కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా గత రేషన్‌కార్డులో కుటుంబ సభ్యుడిగా ఉండి, ప్రస్తుతం పెళ్లి జరిగి మరో కుటుంబంగా ఉంటున్న వారి వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. దీంతో కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అందుబాటులో ఉన్న కుటుంబసభ్యుల ఫొటోలను నేరుగా తీసుకుంటుండగా.. అందుబాటులో లేనివారివి ఫైల్‌ఫొటోలు తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి నెంబర్లకు, ఆధార్‌లో ఉన్న ఇంటినెంబర్లకు తేడా ఉంటుండడంతో వివరాల సేకరణ అధికారులకు ఇబ్బందిగా మారింది. ప్రధానంగా పట్టణాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఖమ్మంకలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఖమ్మం కార్పొరేషన్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేపై సమీక్ష నిర్వహించారు జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితులైన రాష్ట్ర భూగర్భగనుల శాఖ కార్యదర్శి కె.సురేంద్రమోహన్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. మొదటిరోజు ఒక్కో బృందం 15నుంచి 20 కుటుంబాల వరకు సర్వే చేపట్టింది. శుక్రవారం నుంచి సర్వే మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది. కనీసం మరో మూడురోజులు ఈ సర్వే జరగనుంది.

సర్వేలో సవరణలు

పైలెట్ ప్రాజెక్టుగా సాగుతున్న ఈ సర్వేలో అనేక సవరణలు చేస్తున్నారు. కుటుంబాల్లో వచ్చిన కొత్త మార్పులకు అనుగుణంగా మార్పులు, చేర్పులను నమోదు చేస్తున్నారు. తల్లిదండ్రులను ప్రత్యేక కుటుంబంగా చూపిస్తూ పెళ్లయిన కుమారులు, వారి భార్య, పిల్లలు మరో కుటుంబంగా నమోదు చేస్తున్నారు. దీంతో కుటుబాల సంఖ్య గణనీయంగా పెరుగనుంది. గతంలో ఒక వార్డులో 150కుటుంబాలుంటే ఇప్పుడు 300లకు పైగా కుటుంబాలు నమోదవుతున్నాయి. కుటుంబంలో ఎవరైనా చనిపోతే వారి పేర్లను తొలగిస్తున్నారు. అలాగే దేశ, విదేశాల్లో చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని కూడా కుటుంబంలో సభ్యులుగా ఉంచి వారి ఫొటోలను కూడా తీసుకుంటున్నారు. అలాగే గతంలో ఆధార్‌కార్డుల్లోని వయస్సులను ప్రస్తుత వయస్సును పోల్చి సర్వేలో నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమానురాలిగా మహిళ పేరును నమోదు చేస్తున్నారు.

సర్వే జరుగుతున్నప్రాంతాలివే..

ఖమ్మం జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో 6 గ్రామాలతోపాటు 4 మునిసిపల్ వార్డుల్లో ఈ సర్వే ప్రక్రియ చేపట్టారు. ఖమ్మం నియోజకవర్గంలో రఘునాథపాలెం మండలం రాములుతండాలో 165 కుటుంబాలు, ఖమ్మం కార్పొరేషన్‌లోని 54వ డివిజన్‌లో 1,200కుటుంబాలు, పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం ధర్మాతండాలో 160కుటుంబాలు, ఖమ్మంరూరల్ మండలంలోని గుదిమళ్ల పంచాయతీలోని కోట నారాయణపురంలో 164 కుటుంబాలు, మధిర నియోజకవర్గంలోని చింతకాని మండం సీతంపేట గ్రామంలోని 17వార్డులో 160కుటుంబాలు, మధిర పట్టణంలోని 17వార్డులో 170 కుటుంబాలు, వైరా నియోజకవర్గంలోని ఏన్కూరు మండలం కోదండరాంపురంలో 161కుటుంబాలు, వైరాలోని 14వార్డులో 190కుటుబాలు, సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలం వాచ్యానాయక్‌తండాలో 197కుటుంబాలు, సత్తుపల్లిపట్టణం 22వార్డులో 230కుటుంబాలకు ఈ డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారు.

భద్రాద్రి జిల్లాలో ఏడు గ్రామాలు, మూడు మునిసిపాలిటీల్లో వార్డుల్లో సర్వే నిర్వహిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా పంచాయతీలో 171 కుటుంబాలు, పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో 330 కుటుంబాలు, దమ్మపేట మండలం ఆళ్లపల్లి పంచాయతీలోని 175కుటుంబాలు, ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో 178కుటుంబాలు, అశ్వాపురం మండలం అశ్వాపురం మండలం చందర్లపాడు పంచాయతీలోని 190 కుటుంబాలు, మణుగూరు మున్సిపాలిటీలోని 6వ వార్డులో 248 కుటుంబాలు, చర్ల మండలం పులిగుండాల గ్రామంలో 190 కుటుంబాలు, భద్రాచలం గ్రామపంచాయతీలోని 9వ వార్డులో 280 కుటుంబాలు, దమ్మపేట మండలం ఆళ్లపల్లి గ్రామంలోని 175 కుటుంబాలు, ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలోని 178 కుటుంబాలు, ఇల్లెందు మండలం పూబెల్లి పంచాయతీలోని 172 కుటుంబాలు, ఇల్లెందు మునిసిపాలిటీలోని 19 వార్డులో 310 కుటుంబాలకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రజలు ఇళ్లలో ఉన్నప్పుడే సర్వేకు వెళ్లాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్
- ఇరు జిల్లాల్లో సర్వే తీరు పరిశీలన

కూసుమంచి/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ పైలెట్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ తెలిపారు. ఇరు జిల్లాలో చేపట్టిన పైలెట్ సర్వేను గురువారం ఆయన పరిశిలించారు ముందుగా పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం ధర్మాతండాలో నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీవో రాజేశ్వరి కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఇళ్లలో ఉన్న సమయంలో వారి ఇళ్లకు వెళ్లి సర్వే సమగ్రంగా నిర్వహించాలని సురేంద్రమోహన్ తెలిపారు. స్పెల్లింగ్స్‌లోనూ తప్పులు రాయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో డిజిటల్ కార్డు సక్సెస్ అయిందని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతికుటుంబానికి డిజిటల్ కార్డులు అందించాలని నిర్ణయించిందన్నారు. ఒక కుటుంబానికి ఒక ఐడీతోపాటు, ప్రతిసభ్యునికి ఒక ఐడీ అందిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారునికి అందించేందుకు ఈ కార్డులు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ అధికారులకు అవసరమైన సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. ఈ పైలట్ సర్వే ప్రక్రియ 9వ తేదీ వరకు నిర్వహించి వెంటనే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

భద్రాద్రి జిల్లా పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డు, ఇల్లెందు మండలం పూబల్లి గ్రామంలో నిర్వహిస్తున్న డిజిటల్‌కార్డు సర్వేను ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా సేకరించాలన్నారు.

కుటుంబ సర్వే సమగ్రంగా నిర్వహించాలి

- ప్రతి కుటుంబాన్ని విడివిడిగా నమోదు చేయాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కుటుంబసభ్యుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

కొత్తగూడెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియలో కుటుంబ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. డిజిటల్ కార్డు సర్వే నిర్వహిస్తున్న జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో గురువారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో కుటుంబ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యుల పేర్లు, పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులకు యజమానికి గల సంబంధం తదితర వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు.

కుటుంబంలో చనిపోయిన, వివాహం చేసుకుని వెళ్లిన వారి వివరాలను తొలగించాలని సూచించారు. వివాహంతో కుటుంబంలోకి కొత్తగా వచ్చినవారి వివరాలు నమోదు చేయాలన్నారు. కుటుంబసభ్యుల అనుమతితో గ్రూప్‌ఫొటో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సర్వేలో ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

మున్నేరు బాధితులకు ఇళ్లు

- తొలి విడతగా 47 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- సీఎం వద్ద ప్రతిపాదించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 3: మున్నేరు వరద బాధిత కుటుంబాలకు భవిష్యత్‌లో వరద ముంపు బాధలు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలు చేస్తోంది. అందులో భాగంగా వరద బాధితుల్లో ఇళ్లు కోల్పోయినవారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ప్రతిపాదించారు. మున్నేరు వరదలో ధ్వంసమైన 46 నివాసాలను ఇప్పటికే అధికారులు సర్వేలో గుర్తించారు. ఆయా కుటుంబాలకు రెండు పడకల ఇళ్లు అందించేందుకు మంత్రులు చొరవ తీసుకున్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి మున్నేరు బాధితులకు రెండు పడకల ఇళ్లు ఇవ్వాలని మంత్రుల ఆధ్వర్యంలో మేయర్ పునుకొల్లు నీరజ కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మున్నేరు వరద బాధితులకు రెండు పడక గదుల ఇళ్లు అందనున్నాయి.

మున్నేరు బాధితులకు అండగా...

మున్నేరు వరద బాధితులు ఇప్పుడిప్పుడే కష్టాల నుంచి కోలుకుంటున్నారు. ప్రభుత్వంతో పాటుగా స్వచ్ఛంద సంస్థలు సైతం నెల రోజులకుపైగా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. ప్రారంభంలో నిత్యావసరాలు అందించిన సంస్థలు ఇప్పుడు మరో అడుగు ముందుకేసీ బాధిత కుటుంబాలు గతంలో చేపట్టిన వృత్తులపై సర్వే నిర్వహించి వరదల్లో కొట్టుకుపోయిన చేతి వృత్తుల పరికరాలు, యంత్రాలను సైతం పంపిణీ చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసులతో ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు ఇప్పటికే సేవా కార్యక్రమాలు అందిస్తున్నాయి.



ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంలో..

బతుకమ్మ.. ఆశీర్వదించమ్మా..

రెండో రోజూ అదే జోష్

బతుకమ్మ బోనాల సందడి రెండో రోజూ అదే జోష్‌తో సాగింది. మహిళలు గురువారం అటుకుల బతుకమ్మగా ఉత్సవాన్ని నిర్వహించారు. తంగేడు, తదితర పూలతో బతుకమ్మను అందంగా పేర్చి మహిళలు చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ పాటలను పాడారు. బతుకమ్మను తయారు చేయటంలో మహిళలు ఎవరికి వారు తమ ప్రతిభను ప్రదర్శించారు. కాలనీలు, అపార్టుమెంట్లతోపాటు దేవాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు తదితర కూడళ్లలో బతుకమ్మ సందడి కనిపించింది.

- ఖమ్మం సాంస్కృతికం,



దెబ్బమీద దెబ్బ

- గాలివానతో నేలవాలిన వరి
- కూసుమంచి మండలంలో వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంట

కూసుమంచి, అక్టోబరు 3: గోటి చుట్టుపై రోకటిపోటులా తయారైంది కూసుమంచి మండలంలో రైతుల పరిస్థితి. ఇప్పటికే సెప్టెంబరు 1న కురిసిన భారీ వర్షాలు, వరదలతో వరి రైతులు తీవ్రంగా నష్టపోగా ఏదో ఒకవిధంగా మళ్లీ పంటలన్నీ తిప్పుకునే క్రమంలో బుధవారం రాత్రి వచ్చిన ఈదురు గాలితో కూడిన వర్షం వరి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పైరు ఈదురు గాలికి నేలకొరిగింది. మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో పంట నేలకొరిగింది. లక్షల పెట్టుబడి పెట్టి సాగుచేస్తున్న రైతులు ప్రకృతి విపత్తులతో తీవ్రంగా నష్టపోతున్నారు. కూసుమంచి మండలంలోని కూసుమంచి, గుర్వాయిగూడెం, పాలేరు, జుజ్జులరావుపేట, రాజుపేట, పెరికశింగారం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నేలవాలింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు కూసుమంచి ఏడీఏ సరిత, ఏవో వాణి నేలవాలిన వరి పొలాలను పరిశీలించారు.

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- సన్న, దొడ్డు రకాలకు వేర్వేరు కేంద్రాల ఏర్పాటు
- కొనుగోలు సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 3: వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ 2024-25కు సంబంధించి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్ల ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలను వివరిస్తూ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు, సన్న రకం ధాన్యం కొనుగోలుకు రూ.500 బోనస్ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు జిల్లాల్లో పటిష్ట కార్యాచరణ చేపట్టాలన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు (మిగతా 6వ పేజీలో)



సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

భద్రాద్రిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- నేడు ఆదిలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనం
- చిత్రకూట మండపంలో వైభవంగా శ్రీరామాయణ పారాయణం



చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, అక్టోబరు 3: భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం శ్రీరామాయణ పారాయణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్రి ప్రయుక్త విజయదశమి వేడుకల్లో భాగంగా లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దేవస్థానం రామాయణ పారాయణాదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు శ్రీరామాయణ పారాయణం నిర్వహిస్తున్నారు. చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ముందుగా పారాయణం నిర్వహించే వైదిక సిబ్బందితోపాటు భక్తులకు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రామాదేవి దేవస్థానం కండువాలను అందజేశారు. ఈ క్రమంలో తొలిరోజున సంక్షేప రామాయణ హోమాన్ని నిర్వహించారు. రామాయణ పారాయణ మహోత్సవాలు 12వరకు కొనసాగనున్నాయి. కాగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అష్టలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ప్రతిరోజు రాత్రి తిరువిధి సేవ నిర్వహించనున్నారు. 12న విజయదశమి రోజున శ్రీరామాయణ పారాయణ పరిసమాప్తి సందర్భంగా శ్రీరామమహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. అలాగే దసరా మండపంలో విజయోత్సవం, శమీపూజ శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయ రాఘవన్, వైదిక, పరిపాలన సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా వైవీ, రంగారావు

ఖమ్మం, ఖానాపురంహవేలి అక్టోబరు 3: ఖమ్మం జిల్లా పీఆర్‌టీయూ ఉపాధ్యాసంఘం జిల్లా అధ్యక్ష ప్ర ధాన కార్యదర్శులుగా యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్ రంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ హజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో పీఆర్‌టీయూ సంఘం ఎప్పటికీ ముందుంటుందని అన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు త్వరలోనే ఉద్యోన్నతి సాదించటం జరుగుతుందని పెండింగ్ బిల్లులు, సీపీఎస్ రద్దుకు పోరాడుతామని పేర్కోన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను అబినందించారు. నూతన అధ్యక్షుడు వెంకటే శ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరి ష్కారానికి, సంఘం అబివృద్ధికి కృషిచేస్తానని సం ఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రికొత్తగుడెం జిల్లా సంఘం అధ్యక్షుడు డి వెంకటేశ్వర్లు ప్రచార కార్యదర్శి ప్రసాద్ 22 మండల, పట్టణ శాఖల నాయకులు ఆధ్వర్యంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా విజయ్ అమృత కుమార్, ఉపాధ్యక్షులుగా కట్టా శేఖర్, కొమ్ము శ్రీనివాసరావు, కార్యదర్శులుగా చింతల రవికుమార్, సోమ్లానాయక్, తోపాటు పలువురు సభ్యలను ఎన్నుకున్నారు.


వై వెంకటేశ్వర్లు


రంగారావు


రవికుమార్

జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జ్ జీఎంగా సీతారాం

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబర్ 3: ఖమ్మం జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్‌గా తేజావత్ సీతారాం విధుల్లో చేరారు. గతంలో జీఎంగా పనిచేసిన అజయ్‌కుమార్ గత నెల 30న ఉద్యో విరమణ చేయడంతో ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా పరిశ్రమల శాఖ జరనల్ మేనేజర్‌గా ఉన్న సీతారాంను ఖమ్మం ఇన్‌చార్జ్ జీఎంగా ప్రభుత్వం నియమించింది. సీతారాం 2005 నుంచి 2010 వరకు ఖమ్మం పరిశ్రమల శాఖ కార్యాలయంలో ఐపీఓగా, 2014 నుంచి 16 వరకు డీఆర్‌డీఏలో అడిషనల్ పీడీగా పని చేశారు. అనంతరం ఉద్యోన్నతిపై సూర్యాపేట జనరల్ మేనేజర్‌గా విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్‌గా వారంలో మూడు రోజులు అందుబాటులో ఉంటారు.


సీతారాం

హరిదాసులేరి?

- నాడు రామాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఐదు గోతాలకు చెందిన అర్చక సిబ్బందిని తీసుకొచ్చిన భక్త రామదాసు
- రామదాసు కీర్తనలు ఆలపించడానికి హరిదాసు వ్యవస్థ ఏర్పాటు
- తూము నరసింహదాసు ఉత్సవాల పరిరక్షణకు చర్యలేవి
- జ్ఞాపకాల సంరక్షణకి దేవస్థానం కృషి శూన్యం

భద్రాచలం, అక్టోబరు 3: దక్షిణ అయోధ్యగా విరాజిల్లు తున్న భద్రాచలంలో భక్తరామదాసు ఆనాడు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఐదు గోత్రాలకు చెందిన అర్చక సిబ్బందిని తీసుకొచ్చారు. అలాగే రామదాసు కీర్తనలను గానం చేసేందుకు హరిదాసు వ్యవస్థను సైతం ఏర్పాటు చేశారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా భద్రాద్రి దేవస్థానం అధికారులు హరిదాసు వ్యవస్థ పటిష్టతపై దృష్టి సారించకపోవడం పట్ల రామ భక్తుల్లో ఆక్షేపణలు వ్యక్తమ వుతున్నాయి. ఇటీవల భద్రాద్రి దేవస్థానం విశ్రాంత హరి దాసు, భక్తరామదాసు తీసుకొచ్చిన హరిదాసు వంశంలో చివరి తరంవారు శేషం రాధాకృష్ణమూర్తి మృతి చెందడంతో ఆనాటి వ్యవస్థకు తీరని లోటని చెప్పక తప్పదు. అలాగే వారి సంతానం ఈ వ్యవస్థలోకి రాకపోవడం, గతంలో హరి దాసులుగా పని చేసిన వీరారెడ్డి, కృష్ణ, సత్యనారాయణ ఇటీ వల కాలంలో కాలం చేయడంతో హరిదాసు వ్యవస్థ పటిష్ట తకు చర్యలు చేపట్టాల్సిన అవసరం మరోసారి తెరపైకి వ చ్చింది. గతంలో ముగ్గురు హరిదాసులుండగా నేడు కేవలం ఒక్కరు మాత్రమే ఉండటం గమనార్హం. ఇటువంటి స్థితిలో ఆలయ క్యాడర్ స్ట్రెన్త్‌లో హరిదాసు పర్మినెంటు పోస్టు ఉన్న ప్పటికీ వీరారెడ్డి మరణం తరువాత దానిని పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యానికి నిద ర్శనమని రామ భక్తులు విమర్శిస్తున్నారు. అదేవిధంగా దర్బారు సేవలో మృదంగ విద్వాంసులుగా పని చేసిన శ్రీకా కులం సూరిబాబు ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ఆ పోస్టును సైతం దేవస్థానం అధికారులు దశాబ్దంన్నర కాలంగా భర్తీ చేయలేదు.

తూము నరసింహదాసు ఉత్సవాల పరిరక్షణకు చర్యలేవి

భద్రాచలంలో రామాలయాన్ని భక్తరామదాసు నిర్మిస్తే ఆ లయానికి ఉత్సవ శోభను సమకూర్చింది మాత్రం తూము నరసింహదాసు. ఆనాడు స్వామి వారికి సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు దశవిధ ఉత్సవాలను ఏర్పా టు చేశారు. అంతే కాకుండా ఆయా ఉత్సవాలకు సంబం ధించిన కీర్తనలను సైతం రచించారు. వారి తరువాత కూడా ఆ వ్యవస్థ గొప్పగా వెలుగొందాలని శాసనాలు సైతం వరదరామదాసు చేత లిఖింపజేశారు. రాను రాను వాటిలో కేవలం మూడు సేవల్లో మాత్రమే హరిదాసుల ప్రత్యక్ష పాత్ర మనకు కనిపిస్తుంది. సుప్రభాతం, దర్బారు సేవ, పవళింపు సేవలో మాత్రమే హరిదాసులు పాల్గొని కీర్తనలు ఆలపించడం జరుగుతోంది. కాగా వీటిలో ప్రపంచంలో ఎక్కడ జరగని ప్రత్యేక సేవ దర్బారుసేవ (ప్రభుత్వోత్సవం) సాయంసంధ్య సమయంలో ప్రతీ రోజు భద్రాద్రి రామాల యంలో నిర్వహిస్తూ ఉంటారు. ఈ సమయంలో హరిదా సులు రామదాసు, తూము నరసింహదాసు తదితర వాగ్గే యకారుల కీర్తనలను ఆలపిస్తూ ఉంటారు. అదేవిధంగా తూము నరసింహదాసు రచించిన చూర్ణికలను సైతం ఒక్కొక్కరు ఒక్కొక్క వ్యాఖ్యాన్ని పఠిస్తూ ఉంటారు. కాగా నేడు ఒక హరిదాసు ఉండటం వలన సహకార వాద్యంగా ఉన్న వారు ఆ వాఖ్యాలను చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత ప్రత్యేకమైనటువంటి ఉత్సవానికి ప్రత్యేకమైన శ్రద్ధ దేవస్థానం అత్యవసరంగా దృష్టిసారించాల్సి ఉందని రామ భక్తులు భావిస్తున్నారు.


దర్బారు సేవలో ఒకే హరిదాసు గానం చేస్తున్న దృశ్యం

జ్ఞాపకాల సంరక్షణకి దేవస్థానం కృషి శూన్యం

పురాణపరంగా, చారిత్రకపరంగా ఎంతో ప్రసిద్ధి పొందిన భద్రాచలానికి ఎంతో మంది మహనీయులు వివిధ సంద ర్భాల్లో విచ్చేశారు. ఆనాటి రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతులు, మాజీ ప్రధాని, మాజీ ఉప ప్రధాని తదితర ప్రముఖులు ఆలయాన్ని సందర్శించగా అందులో అత్యధిక శాతం మంది ఆలయ సందర్శనకు సంబంధించిన ఫోటోలు దేవస్థానం వద్ద లేవు. స్వామి వారికి విశేషమైనటువంటి ఉత్సవాలు కూడా అనేకం జరిగాయి. ఛాయచిత్రగ్రహణ మొదలైన నాటి నుంచి వీడియోలు, ఫోటోలు అలాగే ప్రసిద్ధుల రాకను పురస్కరించుకొని ఫోటోలు, వారి రాక సమయంలో పరిర క్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వాతంత్ర్యం సిద్ధిం చిన తరువాత ఇప్పటి వరకు ఒకేసారి 1987లో మహాసా మ్రాజ్యా పట్టాభిషేకం జరగ్గా దానికిసంబంధించిన ఫోటోలు, వీడియోలు దేవస్థానం వద్ద అందుబాటులో లేకపోవడం శోచనీయం. అలాగే తరువాత జరిగినటువంటి ఎన్నో ముఖ్య, కీలక ఘట్టాలకు సంబంధించిన అరుదైన ఫోటోలు భద్రపరిచేందుకు కనీసం లైబ్రరీ నిర్వహణ చేపట్టకపో వడం దేవస్థానం అధికారుల చిత్తశుద్ధిని చెప్పకనే చెబు తోంది. ఇటువంటి జ్ఞాపకాలు భద్రపరచడం వలన నేటిత రంతో పాటు రాబోయే తరాలకు వాటిని అందించి పరిరక్షిం చేందుకు మార్గం సుగమయం అయ్యేది. అంతే కాకుండా వీడియోలు ఉండటం వలన ఆనాడు ఎలా ఆచరించారో విషయం కూడా తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడు తుంది. ఈ నేపథ్యంలో ఈ లోటును గమనించి తక్షణమే భద్రాద్రి దేవస్థానం, దేవాదాయ శాఖ అధికారులు ఇందుకు సంబంధిని చర్యలపై దృష్టిసారించాలని రామ భక్తులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు ప్రారంభం

ఖమ్మం, ఖానాపురంహవేలి/ కొత్తగూడెం అర్బన్ అక్టోబరు 3: ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్మిడియట్ సప్లమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యా యి. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదోతరగతి, ప్రభుత్వ రిక్కాబర్ పాఠశాలలో ఇంటర్మిడియట్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పదో తరగతి విద్యార్థులు 58 మందికి 44 మంది హాజరయ్యారు. ఇంటర్మిడియట్‌లో మొత్తం 47 మందికి 35 మంది హాజరయ్యారు. కేంద్రాలను జిల్లా ఇంటర్మిడియట్ అధికారి కె రవిబాబు, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు పరిశీలించారు.

కొత్తగూడెం అర్బన్: బాబుక్యాంప్, చుంచుపల్లి జిల్లా ఉన్నతపాఠశాలలో ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఓపెన్ సప్లిమెంట రీ పరీక్షలను నిర్వహించారు. పరీక్ష కేంద్రాల ను పరీక్షల సహాయ కమిషనర్ యస్ మాధవరావు పర్యవేక్షించారు. ఇంటర్‌లో 49మంది విద్యార్థులు, పదిలో 46మంది పరీక్షలు రాసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు.

8న కార్గో పాత పార్శిల్స్ వేలం

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 3: ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలోని ఖమ్మం నూతన బస్టాండ్ నందు అక్టోబరు 8న కార్గో పార్సిల్స్ సంబంధించి వినియోగ దారులు తీసుకెళ్ళని పాత పార్సిల్స్‌ఉ వేలం వేస్తున్నట్లు ఖమ్మం వరంగల్ జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ పవన్‌కు మార్ తెలిపారు. పెండింగ్ పార్సిల్ల క్లియరెన్స్ కోసం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మేడేపల్లి విద్యార్థుల ఎంపిక

ముదిగొండ, అక్టోబరు 3: రాష్ట్రస్థాయి ఫుల్‌బాట్ పోటీ లకు మండలంలోని మేడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొనిఅత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. పాఠశాలకు చెందిన వర్షిణి, పావని, యశ్వంతి, మహేశ్వరి, యువలు జిల్లాస్థాయిలో ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావుతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఢిల్లీలో జరిగిన 'స్వచ్ఛభారత్ మిషన్'లో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి

చింతకాని, అక్టోబరు 3: మండల పరిధిలోని వందనం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా అక్టోబరు 2 గాంధీ జయంతి సంధర్బంగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా అందులో ఒకరు శ్రీనివాసరావు కావడం గమనార్హం. శ్రీనివాసరావు గతంలో పనిచేసిన కల్లూరు మండలం కొర్లగూడెం పంచాయతీను 100 శాతం ఓడీఎఫ్ గ్రామంగా మార్చారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి ఆహ్వానం పంపింది. సందర్బంగా శ్రీనివాసరావును ఎంపీడీవో రామయ్య, ఎంపీవో కైసర్, మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

మరమ్మతులు నేర్చుకోండి..

- తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండి
- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సదాశివం

నేలకొండపల్లి, అక్టోబరు 3: గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే బోర్లు, మోటార్లు, పైపులైన్లు పాడైపోయిన ప్పుడు ఎవరి కోసమో చూడకుండా స్వయంగా మరమ్మతులు చేసుకునేలా ప్రతి ఒక్కరూ శిక్షణ పొందాలని ఆర్‌డ బ్ల్యుఎస్ ఎస్ఈ సదాశివం సూచించా రు. గురువారం నేలకొండపల్లి రైతువే దికలో నిర్వహించిన గ్రామపంచాయ తీల్లో పనిచేసే తాగునీటి కార్మికుల శిక్షణా సమావేశంలో సదాశివం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఈ ఓంప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అవాంత రాలు వస్తుంటాయన్నారు. బోర్లు పాడుగావటం, మోటార్లు చెడిపోవటం, పైపులైన్లు పగిలిపోవటం తదితర అవాంత రాలు ఏర్పడినప్పుడు తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. అటువంటి సమ యంలో ఎవరి కోసమో చూ డకుండా పనిచేసే కార్మికులు, సిబ్బందికి మరమ్మతులు తెలిసి ఉంటే వెంటనే బాగు చేసుకోవచ్చన్నారు. దీంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బం దులు లేకుండా ఉంటాయన్నారు. అంతే గాకుండా కార్మికు లు బయటి పనులు చేసుకునే అవకాశం సైతం ఉంటుంద న్నారు. కావున వివిధ అంశాలపై నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజైన గురువారం బోర్లు చెడిపోయినప్పుడు మరమ్మతులు చేయటం ఎలా? అన్న విషయాన్ని వివరంగా వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చై ర్మన్ వెన్నపూసల సీతారాములు, ఈఈ, ఎంపీడీవో య ర్ర య్య, ఎంపీఓ శివ, మెకానిక్ తమ్మినేని నాగేశ్వరరావు, 32 గ్రామ పంచాయతీల నుంచి తాగునీటి సిబ్బంది పాల్గొన్నారు.


బోరుకు ఎలా మరమ్మతులు చేయాలో వివరిస్తున్న ఎస్ఈ

ఆనవాళ్ల అనుబంధం కూలి పోయింది..

- గాలి వానకు కూలిన పురాతన మర్రి చెట్టు..
- స్థానికులతో విడదీయరాని బంధం..

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 3: స్థానికులతో విడదీయరాని ఆత్మీయఅనుబంధంగల పురాతన మర్రిచెట్టు బుధవారం రాత్రి సంభవించిన గాలి వానకు వేర్లతో సహ కుప్పకూలిపోయింది.. స్థానిక రిక్కాబజార్ ప్రాంతంలోని కుమ్మరి బజార్ అంబాభవానీ గుడి వెనుక గల ఈమర్రి చెట్టు వందేళ్లకు పైగా స్థానికంగా ఉంది.. ఊడలు విస్తరించి ఈ ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది. ఈ చెట్టు కింద ఒక మంచినీళ్ల బావి ఉండటంతో దానిని మర్రిబావి అనే పేరొచ్చింది. అనేక తరాలను చూసిన ఈ చెట్టు వల్ల ఈ ప్రాంతాన్ని మర్రిబావి ప్రాంతంగా పిలుస్తారు. గాలి వానకు భూమిలోని వేర్లు పెకిలించుకొని చెట్టు ఒక పక్కకు ఒరిగి పోయింది. ఈ చెట్టు చుట్టూ ఇళ్లే ఉండటంతో చెట్టు ఒక ఇంటిపై పడిపోయినా ఎవరికి ఎటువంటి నష్టం కలగలేదు.. శాఖోప శాఖలుగా విస్తరించి ఊడలు దిగిన ఈ మర్రి చెట్టు సహజ గొడుగు చందంగా చల్లని నీడనిస్తుండటంతో చుట్టు పక్కల వారికి ఎంత ఎండాకాలంలోనైనా ఎండ వేడిమి సమస్య ఉండేది కాదు. మర్రి బావికి సైతం ఈ చెట్టు సహజ రక్షణను ఇస్తూ ఉండేది. ఈ చెట్టు ఊడలు పట్టుకొని ఊగుతూ పిల్లలుఆటలాడేవారు..అలా ఆటలు ఆడిన తరాలు నేడు పెద్ద వయస్సుకు సైతం చేరాయి..స్థానికులు చాలా మంది ఈ చెట్టు నీడలో టిఫిన్ బండ్లు, ఇస్త్రీ బండ్లు తదితర చిరు వ్యాపారాలు చేసుకునేవారు. దశాబ్దాల తరబడి తరతరాలుగా తమతో అనుబంధం కలిగి ఉన్న చెట్టు కూలిపోవటంతో వెనుకటి తరం వారు స్థానికులు బాధకు గురయ్యారు. మర్రి చెట్టు, మర్రి బావి గురించి తెలిసిన వారు ఆ చెట్టు పడిపోయిందని తెలిసి ప్రత్యేకంగా సందర్శించారు.


గాలి వానకు వేర్లతోసహ కూలిన మర్రి చెట్టు

పడిపోయిన వందేళ్ల మహావక్షం తొలగింపు

ఖమ్మం సంక్షేమ విభాగం: వర్షానికి పడిపోయిన వందేళ్ల మహావృక్షాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశాల మేరకు ఖమ్మం టౌన్ ప్లానింగ్ డీసీపీ వికాస్, వికాస్ ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. వృక్షం కిందపడిన సమీపంలో ఉన్న నివాసాలపై పడటంతో నివాసాలు దెబ్బతిన్నాయి. బాధిత కుటుంబాలను వడ్డేబొయిన నర్సింహారావు పరామర్శించారు.

ప్రభుత్వ సంకల్పంతోనే నిరుద్యోగుల కల సాకారం

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 3: విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తూ వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి కుంటుంబాల్లో వెలుగులు నింపిన తెలంగాణ ప్రజా ప్రభుత్వం సంకల్పంతోనే నిరుద్యోగుల కల సాకారం అవుతుందని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు అన్నారు. గురువారం నగరంలోని డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సెంటర్‌లో డిఎస్సీలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను సన్మానించారు.

ధ్రువపత్రాల పరిశీలన త్వరగా పూర్తిచేయాలి

- విద్యాశాఖ అధికారులకు ఇరు జిల్లాల కలెక్టర్ల ఆదేశం

ఖమ్మం ఖానాపురంహవేలి/ కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 3: డీఎస్సీ 2024 ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను గడువులోగా పూర్తిచే యాలని కలెక్టర్ ముజా మ్మిల్‌ఖాన్ జిల్లా విద్యాశాఖ అధికా రులను ఆదేశిం చారు. గురువారం నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండ చూడాలని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ గదుల్లో కేవలం అభ్యర్థిని మాత్రమే అనుమతించాలని ఇతరులను లోనికి అనుమతించవద్దని తెలిపారు. పోస్టుల భర్తికి ప్రభుత్వం 1:3 రేషియోలో అభ్యర్థుల ఎంపి క చేసిందన్నారు. ఖమ్మం జిల్లాలో ఎస్‌జీటీలు 855, స్కూ ల్ అసిస్టెంట్‌లు 508, ఎల్‌పీలు 49, పీఈటీలు 30 మొత్తం 1442 మంది అభ్యర్థులు ఎంపిక అయ్యారని వీరి సర్టిఫికెట్ల అదనపు బృందాలను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో పూర్తి చేయాల ని అధికారులను ఆదేశించారు. కొందరు అభ్యర్థులు మొబైల్‌కు మెస్సేజ్ వచ్చిన లిస్టులో పేరులేదని సర్టిపికెట్ వెరిఫికేషన్ చేయటంలేదని పిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు రాకుండా వెరిఫికేషన్ నిర్వహించాలని డీఈవోకు సూచించారు. మొత్తం ఎస్‌జీటీ లు 206, ఎస్ఏలు 233, ఎల్‌పీలు 27 మంది, పీఈటీలు 24 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హజరైనట్లు డీఈవో తెలిపారు. మొత్తం 14 బృందాలను ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండ పరిశీలనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో కలెక్టర్‌కు తెలిపారు.


ఖమ్మంలో ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


కొత్తగూడెంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

మార్గదర్శకాలు పాటించాలి: భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం అర్బన్: డీఎస్సీ - 24 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలకు అధికారులు ప్రభుత్వ మార్గదర్శకా లను పాటించాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ విపాటిల్ అదేశించారు. గురువారం సింగరేణి పాఠశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కౌంటర్లను పరిశీలించారు. అభ్యర్థులతో మాట్లాడి పరిశీలన ప్రక్రియను అడిగి తెలుసు కున్నారు. రెండవరోజు 401 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. రాత్రి 7గంటల వరకు సర్టిఫికెట్ పరిశీలన కొనసాగింది. జిల్లాలో 447 పోస్టులకు 1:3 నిష్పత్తిలో 1015మంది అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలన చేయనున్నారు. తొలిరోజు 154, రెండవరోజు 401 మందితో కలిపి 555 అభ్యర్థుల పరిశీలన పూర్తయ్యింది. ఈ పరిశీలనకు 211ఎస్‌జీటీలు హాజరయ్యారు.

లాభాల బంతి..


జూలూరుపాడులో బంతి పూల తోట

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం..
- ముమ్మరంగా బంతిపూల అమ్మకాలు
- అధిక వర్షాలతో దిగజారిన దిగుబడులు

జూలూరుపాడు, అక్టోబరు 3: రైతులు వాణిజ్య పంటలతోనే సరిపెట్టుకోకుండా నిత్యం ఆదాయాన్ని సంపాదించాలనే ఆలోచన చేశారు. కొన్నేళ్లగా వాణిజ్య పంటల సాగుతో తీవ్ర నష్టాలపాలైన రైతులు ప్రత్యామ్నయ పంటల వైపు దృష్టిని మళ్లించారు. ఇందులో భాగంగా బంతి సాగును చేపట్టారు పలువురు రైతులు.. తక్కువ వ్యవధిలో పంట చేతికి అంది మూడు నెలలపాటు ఆదాయం తెచ్చిపెట్టే బంతి సాగుకు పెట్టుబడి కూడా తక్కువ కావడంతో రైతులు బంతిసాగు వైపు ఆకర్షితులయ్యారు. భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, టేకులపల్లి, అశ్వరావుపేట తదితర ప్రాంతాల్లో సుమారు 100 ఎకరాల్లో ఈ ఏడాది బంతి సాగు చేశారు. కాగా అధిక వర్షాల కారణంగా పంట దిగుబడి తగ్గింది. గత ఏడాది ఎకరానికి 5 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. కాగా ఈ ఏడాది ఎకరానికి 3 టన్నుల దిగుబడి మాత్రమే లభిస్తుందని రైతులు అంటున్నారు.

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ

బంతి సాగుపై పెట్టుబడి తక్కువగా ఉండటంతో రైతులు ఈ సాగును చేపట్టి లాభాలు గడిస్తున్నారు. ఎకరానికి రూ. 60వేల నుంచి రూ.80వేల వరకు పెట్టుబడి పెట్టారు. కాగా తక్కువ దిగుబడులు వచ్చినప్పటికీ ధర ఆశాజనకంగా ఉండటంతో పెట్టుబడులు పోను ఎకరానికి రూ.30వేల వరకు లాభాలు వస్తాయని అంటున్నారు. కేజీ బంతిపూల ధర రూ.100లు పలుకుతుంది. పండుగ సీజన్ కావడంతో మరింత గిరాకీ పెరుగుతోంది. దసరా ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మల కోసం బంతిపూల అమ్మకాలు జోరుగా సాగుతాయి. దిగుబడులు నిరాశ పర్చిన ధర పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేవలం రెండు నెలలు కష్టపడితే మూడు నెలలపాటు పూలదిగుబడులు వచ్చి లాభాలు కురిపించే బంతిసాగు సరైన పంట అని రైతులు అంటున్నారు.


బంతి పూలు కోస్తున్న మహిళ రైతు

జోరుగా అమ్మకాలు..

జూలూరుపాడులోని ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రయాణీకులకు పసుపు వన్నె ఉన్న బంతి తోటలు విశేషంగా ఆకర్షిస్తు కనువిందు చేస్తున్నాయి. తోటలను సాగుచేసిన రైతులు రహదారి పక్కనే బంతిపూలను విక్రయిస్తున్నారు. దీంతో వచ్చేపోయే వాహణదారులతోపాటు కొత్తగూడెం, పాల్వంచ, ఏన్కూరు తదితర మండలాలకు చెందిన వారు విరివిగా పూలను కొనుగోలు చేస్తున్నారు. బతుకమ్మ సీజన్ కావడంతో ఈ పూల ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా ధర: పోరుండ్ల సైదులు రైతు వెంగన్నపాలెం



అధిక వర్షాలతో వాణిజ్యపంటలు దెబ్బతిన్నా యి. ఈ క్రమంలో బంతి సాగు మేలు అనిపించింది. 7 సంవత్సరాలుగా బంతి సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఎకరంన్నరలో బంతిసాగు చేశాను. కేవలం రెండు నెలల్లోనే పంట చేతికి అందింది. ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉంది.

వర్షాలతో తగ్గిన దిగుబడులు: రాంబాబు రైతు వెంగన్నపాలెం



ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా బంతి దిగుబడులు తగ్గాయి. రైతులకు అనుకూలంగా ధరలు పలకడంతో పెట్టుబడి పోను ఎకరానికి రూ. 30వేల వరకు మిగిలే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వాణిజ్య పంటలకంటే ప్రత్యామ్నాయపంటలే మేలు అనిపిస్తోంది.

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

(5వ పేజీ తరువాయి)

చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు ధాన్యం నాణ్యతాప్రమాణాలపై రైతుల్లో అవ గాహన కల్పించాలన్నారు. సన్న రకం ధాన్యం గుర్తింపు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో అవసరాల మేరకు నూతన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల న్నారు. సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు ధాన్యం రావొద్దని సూచించారు. మిల్లర్ల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు చేయవద్దన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు రెండు రోజుల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయాలన్నారు. దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి కావాలని, కలెక్టర్లు దీన్ని ప్రాధాన్య అంశంగా పూర్తి చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో మాట్లా డుతూ ప్రతి కొనుగోలు కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాలలో సాగు చేసిన ధాన్యం వివ రాలు వ్యవసాయ శాఖ నుంచి తీసుకొని వాటికి తగ్గట్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించామని, క్షేత్రస్థా యిలో అవసరాలను పరిశీలించి మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలె క్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు వారంలో సిద్ధం చేయాల న్నారు. సన్న రకం ధాన్యం వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీ లించి ధృవీకరించాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఫిర్యాదుల కోసం జిల్లాలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామని, 1077 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి రైతులు తమ సమస్యలను తెలుపవచ్చన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ ప్రసాద రావు, డీఆ ర్డీవో సన్యాసయ్య, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి చంద న్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా రవాణాధికారి వెంకటరమణ, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం తదితరులు పాల్గొ న్నారు.

రాజ్యాధికారం దిశగా బీసీలు పోరాటం చేయాలి

● బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ శంకర్

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు3: రాజ్యాధికారం దిశగా బీసీలు పోరాటం చేయాలని, జనాభా దామాషా మేరకు బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు.. గురువారం ఖమ్మం మధురానగర్‌లోని యాదవ సంఘం భవనంలో ప్రొఫెసర్ జి. లక్ష్మణ్ రాసిన కులగణన, రిజర్వేషన్లు శాస్త్రీయ అవగాహన పుస్తక ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారం సాధించేదిశగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రాంతాల వారీగా బీసీలను విభజిస్తూ వారి మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నారని బీసీలు ఇటువంటి వాటిని తిప్పికొట్టాలన్నారు. ఐక్యంగా పోరాడితేనే ఫలితం ఉంటుందని ఆయన సూచించారు. తమిళనాడులో బీసీలకు న్యాయంగా దక్కాల్సిన రిజర్వేషన్లకోసం పెద్ద ఎత్తున ఆందోళన జరిగిందని దానిస్ఫూర్తితో బీసీలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. జనాభాలో యాభైశాతానికి పైగా ఉన్న బీసీలకు తగిన రిజర్వేషన్లు దక్కాలన్నారు. స్థానిక సంస్థలనుంచి చట్ట సభల వరకు బీసీల ప్రాతినిధ్యం పెరగాలన్నారు. విద్య, వైద్యం తదితర రంగాల్లో రిజర్వేషన్లు దక్కడం కోసం బీసీ కులగణన జరపాలన్నారు. ప్రొఫెసర్ లక్ష్మణ్ బీసీ కులగణన, రిజర్వేషన్లు అనే అంశంపై విస్తృత అవగాహన కల్పించే విధంగా పుస్తకం రూపొందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఐటీ విద్యాసంస్థల అధిపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్. జేసీ కృష్ణ, యాదవ సంఘం జిల్లా మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు బొమ్మా రాజేశ్వరరావు, అడ్వకేట్ జేఏసీ నాయకుడు బిచ్చాల తిరుమల రావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

తిరుమలాయపాలెం, అక్టోబరు3: తిరుమలాయపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అఖిలపక్ష నాయకులు కొమ్ము శ్రీను, కొలిచలంస్వామి కొమ్ము పూలే, చింతిరాల నాగభూషణం మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబరు 254లో ఉన్న ప్రభుత్వ ఎకరం భూమిని మాజీ సర్పంచ్ కొప్పుల అశోక్ తప్పుడు పత్రాలు సృష్టించి, ఆక్రమించుకున్నాడని అతనిపై కేసు నమోదు చేసి, పట్టా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మట్టె నాగేశ్వరరావు, పగిడిపల్లి బాబు, కృష్ణయ్య, వీరస్వామి, రామకృష్ణ, నాగేశ్వరరావు తదితకెలె పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బూర్గంపాడు, అక్టోబరు 3: ద్విచక్ర వాహనాన్ని టూరిస్ట్ బస్ ఢీకొట్టిన ప్రమాదంలో వివాహిత మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి సారపాకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మండలం పెదరావిగూడెం గ్రామానికి చెందిన నడిపింటి సరిత(26)కు అనారోగ్యంగా ఉండడంతో బుధవారం రాత్రి భర్త వినోద్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై భద్రాచలం ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని టూరిస్ట్ బస్ ఢీకొట్టింది. దీంతో సరితకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన వినోద్‌ను ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వీరికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. గురువారం మృతురాలి అత్త నడిపింటి సరోజిని ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు..



నారాయణరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా. అక్టోబరు3: వైరా మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రాయల నారాయణ రావు(49)అలియాస్ టీడీపీ నారాయణరావు గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం ఉదయం రోజు మాదిరిగానే కుమార్తెతతో కలిసి వాకింగ్‌కు వెళ్లి వచ్చిన ఆయన ఇంట్లో బాత్‌రూంకి వెళ్లి ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల రైతు సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి నాగి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, టీడీపీ జిల్లా కార్యదర్శి కేతినేని హరీష్, నియోజకవర్గ కన్వీనర్ చెరుకూరి చలపతిరావు, మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతరాములు, ఆర్యవైశ్యసంఘం నాయకులు వనమా విశ్వేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్, రాఘవరావు, మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చిన్నారుల కిడ్నాప్‌కు దొంగ యత్నం

● గ్రామస్థులు వెంబడించడంతో పరారైన దొంగ

కరకగూడెం, అక్టోబరు 3: ఇద్దరు బాలురును కిడ్నాప్ చేసేందుకు దొంగ ప్రయత్నించిన సంఘటన కరకగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరకగూడెం గ్రామానికి సిరిశెట్టి కమలాకర్ కుమారుడు కౌశిక్, కొంపెల్లి వెంకటనారాయణ కుమారుడు శ్రీనాథ్ అనే బాలురు బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో జరుగుతున్న బతుకమ్మ వేడుకలను తిలకించేందుకు ఇద్దరు కలసి వెళ్లారు. కాగా అక్కడికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి వారిని కరకగూడెం ప్రధాన సెంటర్ ఎక్కడ ఉందని అడిగాడు. నాకు దారి చూపిచండి, మరల తీసుకువచ్చి ఇక్కడ దింపుతానని నమ్మించి వారిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. సుమారు 10 గంటల సమయంలో ప్రధాన సెంటర్ నుంచి అనంతారం వైపు ప్రధాన రహదారిపై అతివేగంతో పోతుండగా కౌశిక్ కుటుంబ సభ్యులు చూసి ద్వి చక్ర వాహనాన్ని వెంబడించారు. బాలురు అరుస్తున్నా ఆ వ్యక్తి ఆపకపోవడంతో వారు భయాందోళ చెందారు. కొంత దూరం వెళ్లాక వాహనం కాస్త నెమ్మదిగా వెళ్లడంతో కౌశిక్ వాహనంపై నుంచి కిందకు దూకాడు. మరో బాలుడు కూడా వాహనంపై నుంచి కిందకు దూకగా ఇరువురికి గాయాలయ్యాయి. కాగా దొంగ అక్కడ నుంచి కరకగూడెం వైపు నుంచి మణుగూరు వైపు వెళ్తుండగా గ్రామస్థులు వెంబడించారు. బంగారుగూడెం గ్రామం పరిధిలోని ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వదిలి దొంగ పరార్ అయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామస్థులు ద్విచక్ర వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయమై గురువారం బాలురుల తల్లితండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాగా గురువారం ద్విచక్ర వాహనంపై పరార్ అయిన దొంగ కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం. ద్విచక్ర వాహన దారుడు బైక్‌పై వెళ్తుండగా చెవిలో హెడ్‌షెట్ పెట్టుకోవడం వలన వారు పిలిచింది వినబడకపోవడం.. మరో బాలుడు కింద పడినట్లు తెలపడంతో గ్రామస్థులు కొడతారనే భయంతో పారిపోయి పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు సమాచారం.. ఈ వ్యక్తి కూడా కరకగూడెం మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు. ఈ విషయంపై కరకగూడెం ఎస్ఐ రాజేందర్‌ను వివరణ కోరగా.. బాలుడు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ద్విచక్ర వాహన దారుడు కూడా స్టేషన్‌కు వచ్చాడు.. దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు తెలియపరుస్తామని పేర్కొన్నారు.

ఇక్కడ మార్పులు సహజం!

● భద్రాచలంలో నేడు అమ్మవారికి తొలి అలంకరణ ప్రారంభం

భద్రాచలం, అక్టోబరు 3: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శరన్నవరాత్రోత్సవ ప్రయుక్త విజయదశమి కార్యక్రమాల్లో మార్పులు చోటు చేసుకోవడం భక్తుల్లో చర్చకు దారితీస్తోంది. దాదాపు అన్నిచోట్ల శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల మూడు నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ప్రతిసారి పాడ్యమి నుంచి అమ్మవారి అలంకారాలు భద్రాచలంలో ప్రారంభమవుతుండగా, తొలి అలంకారమైన ఆదిలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తూ ఉంటారు. గత ఏడాది సైతం ఇదే రీతిలో దేవస్థానంలో అలంకరణలు నిర్వహించారు.

కాగా గురువారం తొలి అలంకరణను రాష్ట్ర వ్యాప్తంగా అమ్మవారికి ధరింపజేయగా భద్రాచలంలో మాత్రం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి కారణం తిథుల మధ్య హెచ్చుతగ్గులే కారణమని దేవస్థానం వైదిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రామాలయంలో గురువారం శ్రీ రామాయణ పారాయణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టగా, అష్టలక్ష్మి అలంకరణలో మొదటిదైన ఆదిలక్ష్మి అలంకారం శుక్రవారం(నేటి నుంచి) అమ్మవారికి ధరింపజేయనున్నారు. 2023లో అక్టోబరు 24న విజయదశమి కాగా, ముందు రోజున అంటే 23న మహాలక్ష్మి అలంకారాన్ని అమ్మవారికి ధరింపజేశారు. కాగా ఈసారి 2024లో విజయదశమి అక్టోబరు 12న రాగా, అదే రోజు మహాలక్ష్మి అలంకారాన్ని సైతం అమ్మవారికి ధరింప చేస్తున్నారు. ఇదిలా ఉండగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన తరుణంలో అమ్మవారికి తొలి రోజున కనీసం అభిషేకం నిర్వహిస్తే సముచితంగా ఉండేదని పలువురు వైదిక సిబ్బంది, భక్తులు అంతర్గతంగా చర్చించుకోవడం గమనార్హం. ఇప్పటికే దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంకురార్పణ సమయంలో మార్పులు చేయగా, శరన్నవరాత్రి ఉత్సవాల్లో సైతం ఇదే తీరు కొనసాగడం భక్తుల్లో చర్చకు దారి తీస్తోంది.

అరకకు గిరాకీ



మిర్చి తోటలో కిరాయి అరకతో పాటు చేస్తున్న రైతు

● యాంత్రీకరణ పెరిగినా అరకతోనే కలుపుతీత

ముదిగొండ, అక్టోబరు3: వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉండే కాడెడ్లు నేడు పల్లెల్లో కానరాకుండా పోతున్నాయి. పెరుగుతున్న యాంత్రీకరణ కారణంగా వ్యవసాయ క్షేత్రాల్లో ఎద్దులకు బదులు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. పాత రోజుల్లో వ్యవసాయ రంగం ఎక్కువగా ఎద్దుల అరకపైనే ఆధారపడి ఉండేది.

మండలంలో ఈ ఏడాది అధికంగా మిర్చి, పత్తి పంటలను సాగుచేశారు. మొదట్లో విత్తనాలు వేసే వరకు యాంత్రీకరణను ఉపయోగించినప్పటికీ కలుపుతీతకు మాత్రం కాడెడ్ల అరక తప్పనిసరిగా అవసరమవుతుందని రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయ పొలంలో దుక్కులు దున్నడంతో పాటు ధాన్యం, పశుగ్రాసాన్ని తరలించేందుకు ఎద్దులను ఉపయోగించేవారు. ప్రతి గ్రామంలో ఎక్కడ చూసినా గడపగడపకు ఎడ్లబండ్లు కన్పించేవి. కానీ ప్రస్తుత పరిస్థితులు వాటికి భిన్నంగా మారిపోయాయి. ఎద్దులతో రోజుల తరబడి చేసే పనులను, ట్రాక్టర్లను ఉపయోగించి గంటల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో పంటలు



మందు చల్లుతున్న కూలీలు

సాగు చేయడం కోసం ప్రభుత్వాలు యాంత్రీకరణను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. దీంతో కాడెడ్లు వ్యవసాయానికి క్రమక్రమంగా దూరమవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగంలో ప్రవేశించడం వల్లే ఆధునిక పద్ధతులు వ్యవసాయంలోకి వచ్చాయని చెప్పుకోవచ్చు కానీ...ఎన్నో సంప్రదాయబద్ధంగా నడుస్తున్న కాడెడ్లు మాత్రం వ్యవసాయానికి దూరమవుతున్నాయి. దీంతో పాటు పశువుల పోషణ రైతులకు కష్టంగా మారడంతో పశువులను అమ్మేసి యాంత్రీకరణపై దృష్టి పెడుతున్నారు.

ఎకరానికి రూ.2,500 కిరాయి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలాల్లో కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు ప్రస్తు తం కలుపుతీత పనుల్లో బిజీగా ఉన్నారు. కలుపు నియంత్రణకు కూలీలతోపాటు గుంటక కొట్టేందుకు అరకల కోసం రైతులు వెంపర్లాడుతున్నారు. దీంతో కాడెడ్లకు అమాంతం డిమాండ్ పెరిగింది. ఒక ఎకరం మిర్చితోటలో పాటు చేసేందుకు రూ.2,500కి రాయి, అరకతోలే మనిషి కిరాయి రూ.వెయ్యి ఖర్చు వస్తుందని రైతులు తెలుపుతున్నారు. ఒకేసారి వర్షాలు పడటం, రైతులందరికీ అరక అవసరం పడటంతో కాడెడ్ల అరక దొరికే పరిస్థితి లేకపోవడంతో డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు. కూలీల ఖర్చు, అధిక పెట్టుబడులతోపాటు పంట పొలాల్లో పాటు చేసేందుకు అరక కిరాయి భారంగా మారిందని రై తులు చెబుతున్నారు. పశువులను పెంచేందుకు అధిక వ్యయం కావడం వల్లనే పశువులను అమ్మేసుకున్నామని తీరా ఇప్పుడు మళ్లీ అరక కోసం ఎద్దులను కొనుగోలు చేయాలంటే రూ.రెండు లక్షలతో పాటు వాటికి పశుగ్రాసానికి అధిక వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. ఎంత యాంత్రీకరణ పెరిగినా కాడెడ్ల అరక వ్యవసాయానికి అవసరమని రైతులు పేర్కొంటున్నారు.

ఖర్చు ఎక్కువ అవుతుంది

● బట్టు పురుషోత్తం, రైతు, ముదిగొండ



రెండేసి ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలు సాగుచేశాను. దుక్కు దున్ని విత్తనాలు నాటేవరకు ట్రాక్టర్‌ను ఉపయోగించినప్పటికీ పత్తి, మిర్చి పంటల్లో పాట్లు చేసేందుకు కాడెడ్ల అరక అవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లోనే అరక కిరాయి అధికమవుతుంది. ఒక ఎకరం మిర్చితోటలో పాటు చేసేందుకు రూ.2500కిరాయి, అరక తోలే మనిషి కిరాయి రూ.వెయ్యి ఖర్చు వస్తుంది. గతంలో మా తాతలు, తండ్రులు ఎడ్లతోనే వ్యవసాయం చేసేవారు. ప్రతి ఇంట్లో కూడా గతంలో అరక ఎడ్లు ఉండేవి. పశుపోషణ భారంతో ప్రతి ఒక్కరూ పశువులను అమ్మివేయడంతో కాడెడ్లు కనుమరుగై ప్రస్తుతం వ్యవసాయానికి అరకలు దొరకడం లేదు. ఎంత యాంత్రీకరణ వాడినా వ్యవసాయానికి మాత్రం కాడెడ్లు అవసరమవుతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో వ్యవసాయం కష్టతరంగా మారనుంది.

భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

● సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరెడ్డి



ఓసీ గనిని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్, అక్టోబరు3: మణుగూరు ఏరియా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్టమైన ప్రణాళికలు తయారు చేసుకోవాలని సింగరేణి కాలరీస్ కంపెనీ డైరెక్టర్ ప్రాజెక్ట్ ప్లానింగ్ అధికారి జీ. వెంకటేశ్వరరెడ్డి అన్నా రు. గురువారం మణుగూరులో ఏరియాలోని ఓసీ 4,2 గనులను వ్యూ పాయింట్ ద్వారా సందర్శించారు. బొగ్గు ఉత్పత్తుల వివరాలు సంబంధిత గని అధికారులైన ఏరియా జీఎంను అడిగి తెలుసుకు న్నారు. అలాగే బొగ్గులోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పీకే ఓసీ సైట్ కార్యాలయం వద్ద ఉన్న కనకదుర్గా దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సూచించారు. గనుల్లో చేరిన వరద నీరు ఉత్పత్తికి ఆటంకంగా లేకుండా డిపార్టుమెంట్, అవుట్ సోర్సింగ్ ద్వారా బయటికి పంపేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఏరియాలోని ఓసీ గనుల్లో నీటిని త్వరిత గతిన బయటికి పంపి ఉత్పత్తిని సాధించాలన్నారు. కొండాపురం యూజీమైన్‌లో మ్యాన్ రైడింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం డి. శ్యాంసుందర్, ప్రాజెక్టు అధికారులు లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, రాంబాబు, వెంకట్‌రావు, వీరభద్రుడు, సురేష్, రక్షణ అధికారి లింగబాబు, సర్వే అధికారి చిట్ట శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన

పాలేరు జలాశయం

● 16.30అడుగులకు చేరిన నీటి మట్టం



పాలేరు జలాశయం

కూసుమంచి, అక్టోబరు 3: పాలేరు జలాశయం నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. గరిష్ఠ నీటిమట్టం నీటిమట్టం 23 అడుగులకు గాను 16.30 అడుగులకు చేరుకుంది. మొదటిజోన్ నుంచి నీటిరాక తక్కువగాను, రెండోజోన్‌కు నీటివిడుదల ఎక్కువగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. సాగర్ డ్యామ్‌నుంచి పాలేరు జలాశయానికి 2,827 క్యూసెక్కుల నీరు చేరుతున్నాయి. అదేవిధంగా పాలేరు నుంచి రెండోజోన్ ఆయకట్టుకు 3,812 క్యూసెక్కులు, మిషన్ భగీరధకు 135 క్యూసెక్కులు, పాతకాల్వకు 150 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. పాలేరు జలాశయం నీటిమట్టం తగ్గకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శునకాలను రక్షించాలి

» కమిషనర్ అగస్త్యకు జంతు ప్రేమికుల వినతి

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 3: శునకాలను రక్షించాలని పలువురు జంతు ప్రేమికులు కోరారు. గురువారం ఖమ్మం నగరంలో వీధి శునకాల సంఖ్య రోజు రోజుకు తగ్గుతుందని, గత మూడు నెలల కాలంలో 300 శునకాలు కనుమరుగుకాగా 100శునకాలు మరణించినట్లు తమకు తెలిసిందని జంతు ప్రేమికుల సంఘం(పేటా) ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు విన్నవించారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కొంతమంది కార్పొరేటర్లు శునకాలపై విష ప్రయోగం చేసి హత్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. శునకాలను చంపే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జంతు ప్రేమికుల సంఘం నాయకులు కొండబోలు లక్ష్మణ్, బెజ్జంకి శ్రీనివాస్, విక్రమ్‌శర్మ, రాజేశ్, శ్రీధర్, హర్షిత్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న జంతు ప్రేమికులు

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

● అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య



పూజల్లో పాల్గొన్న రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

భద్రాచలం, అక్టోబరు3: ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. గురువారం శ్రీదేవి శరన్నవరాత్రుల ప్రారంభోత్సవం సందర్భంగా భద్రాచలంలో పలు చోట్ల నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత మార్కెట్, శాంతినగర్, అశోక్‌నగర్, ఆదర్శనగర్, రామాలయం ఏరియా కాలనీల్లో ఉత్సవ కమిటీల వారు ఏర్పాటు చేసిన అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న పొదెం వీరయ్య పూజలు చేశారు. అదేవిధంగా భద్రాచలం పాత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముగిసిన మొదటి విడత మెడికల్ కౌన్సిలింగ్

● ఖమ్మం మెడికల్ కళాశాలలో 65 సీట్లు భర్తీ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 3: ఎంబీబీఎస్ విద్యార్థులకు నిర్వహించిన మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసింది. ఈ నెల 1 నుంచి మొదటి విడత కౌన్సిలింగ్ ప్రారంభమైయ్యింది. తొలి విడతలో 65 సీట్లు భర్తీ చేసుకునేందుకు కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్స్ యూనివర్సిటీ అనుమతి ఇచ్చింది. గురువారం నాటికి 65 మంది విద్యార్థులు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు పొందారు. 100 సీట్లకు గాను నేషనల్ కోటాలో 15 కేటాయించగా, రాష్ట్ర కోటా ద్వారా 85 సీట్లు భర్తీ చేయనున్నారు. జాతీయ కోటాలో 15 సీట్లుకు గాను 12 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్ర కోటాలో మరో 20 సీట్లు భర్తీ చేయాల్సి ఉండగా, అనుమతులు రాగానే ఆయా సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు తెలి పారు. ఈ నెల 14 నుంచి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

- గురువారం రెండో ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులకు క్లీనికల్ తరగతులను నిర్వహించారు. మొదటి ఏడాది విద్యార్థులకు ఏడు విభాగాల్లో క్షేత్రస్థాయిలో అధ్యయన తరగతులను నిర్వహించనున్నారు. మొత్తం 97 మంది విద్యార్థులకు మూడు బృందాలుగా విభజించి జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గైనిక్ విభాగాల్లో ఒక్కో విభాగానికి 33 మంది విద్యార్థుల చొప్పున కేటాయించి రోగులకు నిర్వహించే వైద్య పరీక్షలను పరిశీలించారు. వీరికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ కళావతిభాయి, హెచ్‌వోడీలు బి. కిరణ్‌కుమార్ విద్యార్థులకు పాఠాలను బోధించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా దసరా మహోత్సవం



విద్యుత్ వెలుగులో పెద్దమ్మతల్లి ఆలయం(ఇన్‌సెట్‌లో అమ్మవారు)

పాల్వంచ రూరల్, అక్టోబరు3: జిల్లాలో ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం దసరా మహోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దసరా మహోత్సవాలను కలశ పూజతో ప్రారంభించారు. అమ్మవారికి ఎమ్మెల్యే పట్టువస్త్రాలను సమర్పించారు. పాల్వంచ మండలంలోని కేపీ జగన్నాథ పురంలో గల పెద్దమ్మతల్లి ఆలయం జిల్లాలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రతి యేటా దసరా మహోత్సవాలను నిర్వహించడంలో ఇక్కడ ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. నవ రాత్రి మహోత్సవాల్లో అవదానులతోపాటు 15మంది అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

విద్యుత్ వెలుగులతో దేవస్థానం

దసరా ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ వెలుగులతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గర్భగుడిలో అమ్మవారి అలంకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాలయం గోపురం, నవగ్రహాలు, ఆంజనేయస్వామి విగ్రహాలకు రంగులతో అలంకరించారు భక్తులకు దేవాలయం చుట్టూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆరు దశబ్దాల నుంచి ఈ ప్రాంతంలో వెలిసిన పెద్దమ్మతల్లిని ప్రజలు ఇలవెల్పుగా కొలుస్తుంటారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు ఈ దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. వేలాది మంది భక్తులు ఈ మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారి దీవెనలు అందుకుంటారు. మహోత్సవాల్లో దేవాలయం ప్రాంగణమంతా భక్తులతో కళకళలాడుతోంది. రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలివస్తుంటారు.

డీసీఎంఎస్ కొత్వాల ప్రత్యేక పూజలు

మండలంలోని కేపీ జగన్నాథపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయంలో దసరా మహోత్సవాల్లో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలను అందజేశారు. 9 రోజులపాటు జరిగే నవరాత్రి మహోత్సవాల కార్యక్రమాలపై ఈవో రజినికుమారితో మాట్లాడారు.



కలశ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



పూజల్లో పాల్గొన్న కొత్వాల

అసంపూర్తిగా షాదీఖానా భవనం

» నిధుల కొరతతో నిలిచిన భవన నిర్మాణ పనులు » స్థలంపై అటవీశాఖ అడ్డంకులు » సమస్య పరిష్కారించాలని వినతి

కల్లూరు, అక్టోబరు 3: కల్లూరు పట్టణంలో ముస్లింల షాదీఖానా నిధుల కొరతతో గత ఏడాది నుంచి పనులు ముందుకు సాగక అసంపూర్తిగా నిలిచి పోయింది. ముస్లింల శుభకార్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గత ప్రభుత్వం నూతన షాదీఖానా భవన నిర్మాణానికి రూ.75 లక్షలు కేటాయించింది. గుత్తేదారు పనులు కూడా చేపట్టారు. కాగా ప్రభుత్వం మారడంతో నిధుల కొరతతో సదరు భవన నిర్మాణ పనులు గుత్తేదారు నిలిపివేశారు. ఇలా పనులు నిలిచిపోయి ఏడాది కావస్తున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ముస్లింల వివాహ, ఆధ్యాత్మిక కార్యాక్రమాల నిర్వహణలో వసతి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు.

ఈ భవన నిర్మాణానికి గాను గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ గ్రామ కంఠంగా ఉన్న 7 కుంటల స్థలాన్ని కేటాయించారు. ఈ భవన నిర్మాణానికి ఎదురుగా అటవీశాఖకు సంబంధించి మరో 7 కుంటల స్థలాన్ని కూడా కేటాయించారు. దీనికి ప్రత్యామ్నాయంగా మండల పరిషత్ కార్యాలయం పరిధిలో గల స్థలాన్ని అటవీశాఖ కేటాయిస్తూ మండల పరిషత్, అటవీశాఖ వారికి ఆదేశించారు. అయితే అటవీశాఖ వారు తిరిగి ముస్లింల షాదీఖానా ప్రాంగణం దగ్గర కేటాయించిన ఖాళీ స్థలంపై ఎలాంటి కార్యక్రమాలు జరగనీయకుండా అడ్డంకులు కల్పిస్తున్నారని ముస్లిం మతపెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ముస్లిం కమిటీ సభ్యులు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి కూడా తీసుకు వెళ్లారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఖాళీగా ఉన్న స్థలం ముస్లింలకు ఉపమోగపడేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కాగా శుక్రవారం కల్లూరులో జిల్లా కలెక్టర్ పర్యటన ఉన్న సందర్భంగా నిధుల కొరతతో నిలిచిన షాదీఖానాను పరిశీలించనున్న సందర్భంగా ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వాస్తవ విషయాన్ని పరిగణలోకి తీసుకొని తమకు న్యాయం చేస్తూ నూతన షాదీఖానా నిర్మాణ పనులు సాగేలా దృష్టి సారించాలని స్థానిక ముస్లింలు కోరుతున్నారు.



గోడల దశలోనే ఆగిపోయిన షాదీఖానా భవన నిర్మాణం

'మంత్రి సురేఖను భర్తరఫ్ చేయాలి'

ఇల్లెందు, అక్టోబరు 3: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై, సినీనటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గురువారం బీఆర్ఎస్ మహిళ విభాగం ఆధ్వర్యంలో ఇల్లెందు పట్టణంలో మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను దహనం చేశారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి సభ్యసమాజం సిగ్గుపడే విధంగా మంత్రి కొండా సురేఖ వ్యవహరించిన తీరు ఆమె దిగజారుడుతనానికి నిదర్శనామని బీఆర్ఎస్ మహిళ విభాగం అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక అన్నారు. వెంటనే మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని, మహిళల పట్ల తన చిత్తశుద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి నిరుపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కు సరిత, చంద్రావతి, కౌన్సిలర్లు కటకం పద్మావతి, సిలివేరు అనిత, సంద బిందు, చీమల సుజాత, పాబోలు స్వాతి, నారాయణమ్మ, పూనెం కమల తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు అవసరం

భగత్‌సింగ్ నగర్‌లో నమోదు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు, అక్టోబరు 3: ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం కోసం ప్రతి కుటుంబానికి డిజిటల్ సర్వే కార్డు అవసర మని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాఘవ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస రావు, ఆర్ఐలు లీలావతి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డులతో పేదలకు చేయూత

ఇల్లెందు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన యూనిక్ నెంబర్‌తో ఇచ్చే స్మార్ట్‌కార్డుతో పేద, మధ్య తరగతి వర్గాలకు చేయూత లభిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం యూనిక్‌స్మార్ట్‌కార్డు పైలెట్ ప్రాజెక్టు కింద ఇల్లెందులోని 22వ వార్డులో సర్వే ప్రారంభించారు. ఈ నెల7వ తేదీ వరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పకడ్బందీగా వివరాలను సేకరించాలని అధికారులను కోరారు. కుటుంబసభ్యుల వివరాల నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయని వెల్లడించారు.



సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

దమ్మపేట: ఫ్యామిలీ డిజిటల్ స్మార్ట్ కార్డు సర్వే ప్రయోగాత్మకంగా గురువారం అల్లిపల్లి గ్రామంలో ప్రారంభమైంది. దీనిలో భాగంగా రెవెన్యూ అధికారులు గ్రామంలో ఇంటింటి సర్వేను ప్రారంభించగా సర్వేను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు. సర్వేలో సమగ్ర వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేష్ మాట్లాడుతు మూడు టీంలుగా ఏర్పడి గ్రామంలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 126 నివాసాలను సర్వేచేయటం జరిగిందని తెలిపారు. సర్వే కార్యక్రమంలో కంతనపల్లి ఎస్‌డీసీ అశ్వారావుపేట నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

చంద్రలబోడులో సర్వే

అశ్వాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ హెల్త్ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా నియోజకవర్గంలో మండల పరిధిలోని చంద్రలబోడు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగా అధికారులు గురువారం సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలోని కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. ఈ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ పర్యవేక్షించారు. సర్వే ఈనెల 7వరకు కొనసాగనుంది. అన్ని సంక్షేమపథకాలకు హెల్త్ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని ప్రత్యేకాధికారి కోరారు. ఈ కార్డు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. సర్వేలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సర్వే ఈ నెల 7వ తేదీ వరకూ కొనసాగనుంది. కార్యక్రమంలో బూర్గంపాడు, అశ్వాపురం తహశీల్దార్‌లు ముజామిద్దీన్, స్వర్ణ, ఎంపిఇఓ ముత్యాలరావు,ఆర్ఐ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే అజెండా: పాయం



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక, అక్టోబరు 3: నియోజకవర్గ అభివృద్ధే నా ఎజెండా.. ప్రజలకు, కార్యకర్తలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున్నానంటూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలలో భాగంగా గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లోని బతుకమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సీతారామపురం, పెంటన్నగూడెం, ఉప్పాక, భూపాలపట్నం, ఏడూళ్లబయ్యారం, ఎల్చిరెడ్డిపల్లి, పాతరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించిన ఆయన రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, ఏడూళ్లబయ్యారం గ్రామం నుంచి రావిగూడెం వరకు రూ 2.20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం పినపాక రైతు వేదికలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాగునీటి సరఫరా సహాయకుల శిక్షణా శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన కొమరం యశోద దశదిన కర్మలకు హాజరై, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పాక గ్రామానికి చెందిన కోడెం సడాలయ్య, పోట్లపల్లి గ్రామానికి చెందిన బడే కృష్ణ, తోలెం రాజేశ్వరి, తోలెం జశ్విత్, కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న పడిగా ప్రసాద్‌ను పరామర్శించారు. మండల పర్యటనలో భాగంగా ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్లో రూ.1.15 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామనాథం, ఎంపీడీవో రామకృష్ణ, ఆర్ఐ బాలకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, కొర్సా ఆనంద్, గట్లా శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, వి.లక్ష్మారెడ్డి, కళ్యాణి, కె లింగయ్య, శ్రీను, శివ, శ్రీను, సాంబశివరావు, బండారు సాంబ, మల్లయ్య, ఆరె నళిన్, సమ్మయ్య, అర్జున్, విజయ్, సతీష్‌రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

కొత్తగూడెం లీగల్, అక్టోబరు 3: సిటీ సివిల్‌కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న ఖలీల్ మాదన్నపేట పోలీసుల దాడిలో గాయపడ్డారు. అందుకు నిరసనగా గురువారం న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, క్రీడల కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

భద్రాచలంలో..

న్యాయవాది మహమ్మద్ అబ్దుల్ కరీంపై పోలీసుల దౌర్జనానికి నిరసనగా భద్రాచలం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వరరావుకు బార్ అధ్యలు కోట దేవదానం, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి వినతిపత్రం అందచేశారు.

పూబెల్లిలో సర్వేను పరిశీలించిన కలెక్టర్

ఇల్లెందురూరల్, అక్టోబరు 3: కుటుంబ గుర్తింపు కోసమే ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ సర్వే చేపడుతోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఫ్యామిలీ డిజిటల్ సర్వేను అధికారులు ప్రారంభించారు. ఈ సర్వే ప్రక్రియను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. సర్వే చేస్తున్న అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నారో అధికారులు గుర్తించాలని, వారి మధ్య ఉన్న సంబంధం నమోదు చేయాలని తెలిపారు. కుటుంబంలో ఎక్కువ వయస్సు కలిగిన మహిళను కుటుంబ పెద్దగా గుర్తించాలని, కుటుంబంలో అందరిని కలిపి గ్రూప్ ఫోటో తీయాలని సూచించారు. కలెక్టర్ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు సలహాలను అందించారు. అనంతరం గ్రామస్థులకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాముఖ్యతను వివరించారు. మొదటి రోజు పూబెల్లి గ్రామంలో 125 కుటుంబాలకు అధికారులు సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు నోడల్ అధికారి కాశయ్య, తహశీల్దార్ కోట రవికుమార్, ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే బృందానికి పూర్తి వివరాలు తెలపాలి

భద్రాచలం: ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలతో పాటు రేషన్, ఆరోగ్యం ఇతర స్వయం ఉపాధి పథకాలు అరు లైన కుటుంబాలకు నేరుగా అందించడానికి పైలెట్ పద్ధతిన అమలు చేస్తున్న డిజిటల్ కార్డు రూపకల్పన సర్వే చేయడానికి వచ్చే బృందానికి ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు తెలపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో డిజిటల్ ఫ్యామిలీ కార్డ్ సర్వే కోసం నాలుగు బృందాలను నియమించారు . ఈ క్రమంలో భద్రాచలంలోని వార్డ్ నెంబర్ 9ని పైలెట్ ప్రాజెక్టు క్రింద తీసుకోవడం జరిగింది. దీంతో సర్వే బృందాల పనితీరును శాంతినగర్‌లో పర్యటించి కలెక్టర్ పరిశీలించారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడానికి ఉపయోగపడేలా ఈ కార్డులు రూపొందిస్తున్నామని అన్నారు. కుటుంబ సభ్యులు తప్పనిసరిగా కుటుంబంలోని సభ్యుల వివరాలు పూర్తిగా పారదర్శకంగా తెలపాలన్నారు. అనంతరం సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలో ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనుల పనితీరును కలెక్టర్ దేవస్థానం ఈవో రమాదేవితో కలిసి పరిశీలించారు. అలాగే మిథిలా స్టేడియంలో చేపట్టబోయే రూఫింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్నదాన సత్రాన్ని సైతం ఆయన పరిశీలించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని

పాల్వంచ టౌన్, అక్టోబరు 3: కొత్తగూడెం నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ ఆశీర్వాదంతోనే తాను భారీ మెజార్టీతో ఎన్నికల్లో గెలిచానని, తన సాయశక్తులా, పాల్వంచ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కొత్తగూడెం - పాల్వంచ జంట పట్టణాలుగా కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం, పాల్వంచకు ఔటర్‌రింగ్ రోడ్డుతోపాటు బైపాస్ రోడ్లు ఏర్పాటు చేయనున్నాని, ఎన్ఎండీసీ కర్మాగారం విస్తరణకు కృషి చేస్తున్నానని వెల్లడించారు. రూ.100 కోట్లతో గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్ - హన్మకొండ తర్వాత 3వ స్థానంలో ఉన్న కొత్తగూడెం - పాల్వంచ జంట పట్టణాలుగా తీర్చిదిద్దుతామన్నారు. విలేకర్ల ఇంటి స్థలాల విషయమై జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌తో చర్చించి త్వరలో ఇంటి స్థలాలు మంజూరుకు పాటు పడతానని తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా తాను నిత్యం పనిచేస్తున్నానని కూనంనేని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు బండి నాగేశ్వరరావు, ఎన్. ప్రసాద్, రాహుల్, కేఎల్ఆర్ తనయుడు సిద్దార రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల కొండలరావు, ఎస్‌కే. సుభాని, సీనియర్ జర్నలిస్టులు చంద్ర నర్సింహారావు, జైనుల్లాబుద్దీన్, వీరభద్రం, ఆర్. సంజీవ్‌కుమార్, తోట రామకృష్ణ, జగదీష్, వెంగళరావు, పి.వెంకట నారాయణ, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రముఖుల పూజలు

మణుగూరు, అక్టోబరు 3: మణుగూరు పట్టణ పరిసర ప్రాంతంలోని దేవాలయాల్లో అధికారులు, పట్టణ ప్రముఖులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మణుగూరులోని పైలట్ కాలనీ ఏరియాలోని కనకదుర్గా దేవి ఆలయంలో మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి, బెతంచెర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ శశిధర్ కుటుంబ సమేతంగా దేవీ పూజల్లో పాల్గొన్నారు. గుట్ట మల్లారం గ్రామంలోని పంచముఖ వేద గాయత్రీ దేవి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన యాగం పూజా కార్యక్రమాల్లో ప్రముఖులు దోసపాటి నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయా ఆలయాల అర్చకులు, నిర్వాహకులు పూజాకార్యక్రమ నిర్వహణలు చేపట్టారు.

నవరాత్రులకు పటిష్ట బందోబస్తు

ఇల్లెందు, అక్టోబరు 3: దసరా నవరాత్రులు, బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఇల్లెందు పట్టణంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను తెలిపారు. గురువారం ఇల్లెందు పోలిస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఇల్లెందులో దసరా నవరాత్రులు అత్యంతవైభవంగా కన్నుల పండుగగా జరుగుతాయని, అన్ని వర్గాల ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. దసరా సెలవుల కారణంగా విద్యార్థులు చిన్నారులు, ఈతల కోసం చెరువులు, వాగులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రతలు పాటించాలని, ఇళ్లకు తాళాలు వేసి ఇతర ఊళ్లకు వేళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు బంగారు అభరణాల పట్ల తగిన జాగ్రతలు పాటించాలని డీఎస్పీ కోరారు. దసరా రావణా వద జమ్మీవేడుకలతో పాటు ఊసిరికాయలపల్లి కోటమైసమ్మ ప్రాభవం పట్టణంలో తీవ్రంగా ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పెద్ద ఎత్తున్న పోలీస్ బలగాలు మొహరిస్తున్నట్లు, అలజడులు, ఘర్షణలు సృష్టించే వారిపై సీసీ కేమెరాలతో ప్రత్యేక నిఘా ఉంటుందని, కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ చంద్రబాను తెలిపారు. ఈ సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి



తహసీల్దార్ వద్ద గోడు వెలిబుచ్చుతున్న మహిళలు

మణుగూరు టౌన్, అక్టోబరు 3: మణుగూరు మండల పరిధిలోని పగిడేరు పంచాయతీ పరిధిలోని శాంతినగర్ వాసులకు వరద నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక మహిళలు తహశీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల సంభవించిన వరదల వల్ల సర్వం కోల్పోయామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువులు పశుగ్రాసం వరదల పాలయ్యామని, వ్యవసాయ మోటార్లు, ఎరువుల బస్తాలు, వరద నీటిలో మునిగి పోయాయని తెలిపారు.

రేపు జాబ్ మేళా

చుంచుపల్లి, అక్టోబరు 3: జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా శనివారం జాబ్ మేళాను చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫింగ్ టైటాన్స్ ప్రవేటు లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో 500 పోస్టుల భర్తీకి ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ భర్తీలలో వేర్ హౌసింగ్ అసోసియేట్, స్టోర్ ఎగ్జిక్యూటీవ్, పికర్, ప్యాకర్, షిఫ్ట్ ఇన్‌చార్జ్ లోన్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటీవ్, సర్వీస్ టెక్నీషియన్, క్యాషేర్ అండ్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్, ఫ్లోర్ మేనే జర్, లాండ్రీ ఆపరేటర్ భర్తీ చేయనున్నట్లు వివరాలు వెల్లడించారు. ఎంపికైన వారికి హైదారాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాలలో పోస్టింగ్ ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలని, విద్యార్హత పీజీ వరకూ ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు.

రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, అక్టోబర్ 3 : భద్రాచలం మండలంలోని వివిధ కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ పనులకు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ శంఖుస్థాపన చేశారు. శాంతినగర్‌కాలనీ, సుబాష్‌నగ్‌కాలనీ, అశోక్‌నగర్, సుభాష్‌నగర్ కాలనీ, అశోక్‌నర్ కొత్తకాలనీ, ఎఎస్ఆర్‌కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, అభయ ఆంజనేయస్వామి పార్కు ఎదురుగా డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గతంలో ఎమ్మెల్యే వెంకట్రావ్‌కు కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు లేకుండ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానికులు తెలపగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పనుల ప్రారంభానికి మార్గాన్ని సుగుమం చేశారు. అశోక్‌నగర్ కాలనీలో విద్యుత్ స్థంబాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుపగా అధికారులతో మాట్లాడి విద్యుత్ స్థంబాలు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

జూలూరుపాడు, అక్టోబరు 3: మండలంలోని సాయిరాంతండా గ్రామాన్ని గురువారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సందర్శించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న యువదంపతులు హలావత్ రత్నకుమార్, పార్వతిల కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. సాయిరాంతండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాణోత్ నరసింహరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, నాయకులు దుద్దుకూరి మధుసూదనరావు, నర్వనేని పుల్లారావు, గోపు రామకృష్ణ, రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.